సాక్షి ప్రకాశం

శనివారం । 25 । జనవరి । 2025



అరణ్యంలో గొడ్డళ్ల గర్జన
గిద్దలూరు అటవీశాఖ పరిధిలో ఉన్న నల్లమల అభయారణ్యంలో కలప అక్రమంగా తరలిపోతోంది. అటవీ సిబ్బంది అండతోనే సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. - IIలో..



అమానుషంపై ఆగ్రహం
శ్మశానం విషయంలో రెండు వర్గాల మధ్య వివాదాన్ని పరిష్కరించకుండా అధికార పార్టీకి కొమ్ముకాసిన అధికారులను సస్పెండ్ చేయాలని గ్రామస్తులు పొదిలిలో ధర్నా చేశారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం 30/20

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కల్లుగీత కులాలకు 17 లిక్కర్ షాపులు

- లాటరీ తీసిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



లిక్కర్ షాపులకు లాటరీ తీస్తున్న జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో కల్లుగీత కార్మికులకు సంబంధించి ప్రభుత్వం కల్పించిన 10 శాతం రిజర్వేషన్‌కు సంబంధించి లిక్కర్ షాపులు కేటాయించేందుకు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ శుక్రవారం ప్రకాశం భవనంలో లాటరీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 17 యూనిట్లకు కలిపి మొత్తం 17 షాపులు కేటాయించారు. అందు కోసం ప్రాథమిక లాటరీ నిర్వహించారు. త్వరలో గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఫైనల్ లాటరీ నిర్వహించి షాపులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. లాటరీ ప్రక్రియలో ఎక్సైజ్ శాఖ అధికారులు, కల్లుగీత కులాలకు చెందిన వారు పాల్గొన్నారు.

వచ్చే నెల 14 నుంచి రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు



కరవదిలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీల కరపత్రాలు విడుదల చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు సిటీ: రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పురుషులు, మహిళల క్రీడా పోటీలు ఫిబ్రవరి 14, 15, 16 వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఒంగోలు మండల పరిధిలోని కరవది పీఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం పోటీల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్.ఎం.పి ప్రభాకర్ కుమార్, మారెళ్ల ఆంజనేయులు, గుట్లపల్లి కోటేశ్వరరావు, చాగంటి నాగిరెడ్డి, పల్లపోలు సుబ్బారెడ్డి, పాలేటి రాజేశ్వరరావు, ఎర్రమనేని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన మైనంపాడు విద్యార్థులు


సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి శ్రీవాణి, శృతి, లోహిత, సిరి చందన, అమృత రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కే.వనజ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 29 వరకు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఓబుల్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నరసింహారావు, స్కూల్ స్టాఫ్, హాకీ క్లబ్ మైనంపాడు సభ్యులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి రంగోత్సవ్‌లో జిల్లా విద్యార్థులకు పతకాలు




జానపద నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న యర్రబాలెం విద్యార్థినులు

కంభం/సంతనూతలపాడు: విజయవాడలో శుక్రవారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ 2024-25 పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కంభం మండలంలోని యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జానపద నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. సంగీత ఉపాధ్యాయుడు యం.ఖాసిం పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థినులు పావని, లక్ష్మి, మాధవి, శివపార్వతి జానపద విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే నాగేశ్వరరావు చేతులమీదుగా విద్యార్థినులు, సంగీత ఉపాధ్యాయుడు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. అదేవిధంగా డ్రాయింగ్ పోటీల్లో అంబవరం ఎస్వీ జూనియర్ కాలేజీ విద్యార్థిని శ్రుతి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.



డ్రాయింగ్‌లో ప్రథమ బహుమతి అందుకుంటున్న శ్రుతి

ఆమ్యామ్యా.. అంతా మాయ..!



ఉత్తర బైపాస్‌లో కిమ్స్‌కు ఎదురుగా ఫ్లై ఓవర్ కింద పచ్చదనాన్ని పరచాల్సిన ప్రాంతం

అవి రూ.62 లక్షల విలువైన పనులు. ఓ కాంట్రాక్టర్ 17.32 శాతం లెస్ (తక్కువ)కు టెండర్ వేశారు. నిబంధనల ప్రకారం అతనికే పనులు అప్పగించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు. కార్పొరేషన్‌కు ఆదాయం వస్తున్నా అధికారులు మాత్రం పనులు అప్పగించేందుకు ముందుకు రావడంలేదు. పైగా ఆ పనులు రద్దు చేసేందుకు తెరవెనుక యత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కారణం లెస్‌కు పనులు చేసే అధికారులకు, ప్రజాప్రతినిధులకు పర్సెంటేజీలు రావన్న ఉద్దేశంతోనే మోకాలడ్డుతున్నట్టు కార్పొరేషన్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. కార్పొరేషన్ ఆదాయాన్ని పరిరక్షించాల్సి ప్రజాప్రతినిధులు, అధికారులు కంచే చేనుమేస్తే అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- అక్రమాలకు గేట్లెత్తేసిన కార్పొరేషన్ అధికారులు
- రూ.62 లక్షల పనులకు 17.32 శాతం లెస్ వేసిన కాంట్రాక్టర్
- రూ.10.78 లక్షలు మిగులుస్తామన్నా ముందుకురాని అధికారులు
- 50 రోజులుగా పనులు అప్పగించకుండా తిప్పుకుంటున్న వైనం
- నగరపాలక సంస్థ నిధులు దోచుకు తినేందుకే అంటూ ఆరోపణలు

ఒంగోలు సబర్బన్: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్ క్యాప్) కింద ఒంగోలు నగరంలోని మూడు ప్రాంతాల్లో సుందరీకరణ పనులతో పాటు, రోడ్డు మధ్యలోని డివైడర్లను అభివృద్ధి చేసి మొక్కలు పెంచేందుకు విడివిడిగా మూడు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు వర్కులు కలిపి మొత్తం రూ.62,29,528లకు అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచారు. 2024 డిసెంబరు 2వ తేదీన టెండరు నోటీసులు ఇచ్చారు.



దక్షిణ బైపాస్ నుంచి అభివృద్ధి చేయాల్సిన డివైడర్ ఇదే



డివైడర్‌పై ఎమ్మెల్యే జనార్దన్ ఇంటికి ఎదురుగా ఏర్పాటు చేసిన నెమలి బొమ్మ



48వ డివిజన్‌లో అభివృద్ధి చేయాల్సిన పార్కు

అదే నెల 10వ తేదీ టెండరు దాఖలు చేయటానికి గడువుగా నిర్ణయించారు. ఈలోగా కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఆన్‌లైన్ ద్వారా టెండర్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని ఎవరి అంచనాల ప్రకారం వాళ్లు టెండర్లు దాఖలు చేశారు. నగరంలోని ఉత్తర బైపాస్‌లో ఉన్న కిమ్స్ వైద్యశాల ఎదురుగా ఉన్న హైవే ఫ్లై ఓవర్ కింద ఐల్యాండ్‌ను పచ్చదనంతో సుందరీకరణ చేయటానికి అధికారులు అంచనా విలువను రూ.25,22,984లకు నిర్ధారించారు. అందుకుగాను టెండరు 219/2024కు గాను కాంట్రాక్టరు సీహెచ్‌వీ.సుబ్బారావు 17.32 శాతం తక్కువకు టెండరు దాఖలు చేశారు. అంటే రూ.20,86,003 లకే పనులు పూర్తి చేస్తానని దాని అర్థం. అదేవిధంగా ఈ టెండరులో 17 శాతం లెస్‌కు బోడపాటి హరిబాబు, 9.5 శాతం లెస్‌కు వాకా కృష్ణారెడ్డి, 4.99 ఎక్సెస్‌కు పాలూరి వెంకటేశ్వర రెడ్డి, 5 శాతం ఎక్సెస్‌కు తోటకూర వేణు మాధవరావు కూడా టెండర్లు వేసిన వారిలో ఉన్నారు. అదేవిధంగా 48వ డివిజన్‌లోని దిబ్బల రోడ్డు రైతు బజారు పక్కన ఉన్న డీజేఆర్ పార్కు అభివృద్ధి కోసం 220/204 టెండరు నంబరు ప్రకారం రూ.20,18,076 లకు సంబంధించి టెండరు పిలిచారు. ఇందులో కూడా సీహెచ్‌వీ సుబ్బారావు 17.32 శాతం లెస్‌కు టెండరు దాఖలు చేశారు. సుబ్బారావుతో పాటు ఈ వర్కుకు 7.1 శాతం లెస్‌కు సీతా రామ కన్‌స్ట్రక్షన్స్, 5 శాతం ఎక్సెస్‌కు పెరుగు వాసు, 4.90 శాతం ఎక్సెస్‌కు పాలపర్తి లక్ష్మీ నారాయణ టెండర్లు దాఖలు చేశారు. మూడో వర్కు దక్షిణ బైపాస్ ఆర్చి నుంచి డీ-మార్ట్ వరకు డివైడర్‌లో మొక్కలు పెంచటం పనులు చేపట్టేందుకు 221/2024 నంబరు ప్రకారం టెండరు పిలిచారు. అందుకు గాను రూ.16,88,468 నిధులు కేటాయించారు. ఈ వర్కుకు కూడా సీహెచ్‌వీ సుబ్బారావు 17.32 శాతం లెస్‌కు టెండరు దాఖలు చేశాడు. సుబ్బారావుతో పాటు కాంట్రాక్టర్ గోళ్లమూడి సుబ్బారావు 12.69 శాతం లెస్‌కు, వాకా కృష్ణా రెడ్డి 6.9 శాతం లెస్‌కు, శ్రీ లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ 5.05 శాతం లెస్‌కు టెండర్లు దాఖలు చేశారు.

రూ.10.78 లక్షలు మిగులుస్తామన్నా..

నగరపాలక సంస్థ రూ.62.29 లక్షలకు సంబంధించి అధికారులు టెండర్లు పిలవగా రూ.51.50 లక్షలకు పనులు చేస్తానని కాంట్రాక్టర్ సుబ్బారావు టెండర్లు దాఖలు చేశారు. దీంతో కార్పొరేషన్‌కు సుమారు రూ.10.78 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. అయితే అధికారులు అతనికి పనులు అప్పగించే విషయంలో తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెండర్లు పిలిచి నేటికి 54 రోజులు పూర్తయింది. డిసెంబరు 2వ తేదీన టెండర్లు పిలిస్తే పదో తేదీన టెండర్లు ఓపెన్ చేశారు. టెండర్లు ఓపెన్ చేసిన తరువాత కాంట్రాక్టర్‌కు గడువు విధించి ఎన్ని రోజుల లోపు చేస్తావు అని అగ్రిమెంటు చేయించుకుంటారు. నిబంధనల మేరకు కాంట్రాక్టరుకు పనులు అప్పగించి ఉంటే ఇప్పటికే దాదాపు పనులు కూడా పూర్తయి ఉండేవి. తాను పనులు మొదలుపెడతానని, అగ్రిమెంటు చేయాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు చుట్టూ, మున్సిపల్ ఇంజినీర్ ఎస్.చెంచయ్య చుట్టూ కాంట్రాక్టర్ ప్రదక్షిణలు చేస్తున్నాడు. దాదాపు 50 రోజులుగా కాంట్రాక్టరుకు అధికారులు అగ్రిమెంట్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారంటే ఎందుకోసం? ఏమి ఆశించి ఈ విధంగా ఇబ్బందుల పాలు చేస్తున్నారో అవగతం కావడంలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిడిల మేరకు పనులు అప్పగించడం లేదని ఒక వైపు బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు లెస్‌కు పనులు చేస్తే నాయకులకు, అధికారులకు పర్సెంటేజీలు రావని మోకాలడ్డుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అసలు ఈ మూడు పనులు రద్దు చేసేందుకు అధికారులు యత్నాలు చేస్తున్నారని, ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్‌ను ఫైలుపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.

> **అగ్రిమెంట్ చేయించుకోవాలని ఎంఈకి చెప్పాను...**
>
> నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్ క్యాప్) పనులకు సంబంధించి వచ్చిన టెండర్ల ప్రకారం కాంట్రాక్టర్ చేత అగ్రిమెంట్ చేయించుకోవాలని మున్సిపల్ ఇంజినీర్ (ఎంఈ) ఎస్.చెంచయ్యకు చెప్పాను. ఆలస్యం చేయకుండా అగ్రిమెంట్ చేయించుకొని గడువులోపు పనులు పూర్తి చేయించాలని కూడా ఆదేశించాను. అలా కాకుండా అగ్రిమెంట్ చేసి కూడా కాంట్రాక్టర్ పనులు సకాలంలో చేయకపోతే కాంట్రాక్టు రద్దుచేసి తిరిగి టెండర్లు పిలుస్తాం. అవి కేంద్ర ప్రభుత్వ నిధులు సకాలంలో పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కు వెళతాయి. లెస్‌లు వేసినందుకు కాంట్రాక్టరుకు అగ్రిమెంటు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారనడం తగదు. కాంట్రాక్టరు మా వద్దకు రాలేదు. టెండర్లు పూర్తయిన పనులను రద్దు చేయం.
>
> – కె.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ

చలివేంద్రంపై ఎస్సైకు కోపమొచ్చింది !

- పోలీసులే స్వయంగా తొలగింపు



సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని తొలగించి సామానులు కుప్పగా వేసిన దృశ్యం

సింగరాయకొండ: పదేళ్లుగా ఏటా వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రంపై ఆ ఎస్సైకి కోపమొచ్చింది. ఆయన ఆదేశాలతో పోలీసులే స్వయంగా చలివేంద్రం కోసం ఏర్పాటు చేసిన మెష్‌ను ధ్వంసం చేశారు. పోలీసుల తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏటా చలివేంద్రం నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ మెష్‌ను శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు ఐరన్ కటింగ్ మెషిన్ తెచ్చి మరీ కట్ చేసి కుప్పగా వేశారు. ఈ చలివేంద్రాన్ని ఏటా వేసవి కాలంలో ప్రస్తుత యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, సర్పంచ్ తాటిపర్తి వనజ ఆధ్వర్యంలో పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. తమ సొంత నిధులతో ఏప్రిల్ నెల నుంచి జూలై నెల వరకు ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటు చేసి మినరల్ వాటర్ తెప్పించి ప్రయాణికులకు, పాదచారులకు, చిరువ్యాపారుల దాహార్తిని తీర్చేవారు. చలివేంద్రంను మొదట్లో తాటాకులతో ఏర్పాటు చేసేవారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వదిన తాటిపర్తి వనజ సర్పంచ్ గా గెలుపొందిన తరువాత ఆ చలివేంద్రాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలన్న మంచి ఉద్దేశంతో శాశ్వతంగా ఉండేందుకు ఐరన్ మెష్‌తో ఏర్పాటు చేశారు. ఈరోజు ఏమయిందో ఏమో, ఏ రాజకీయ ఒత్తిడి వచ్చిందో కానీ ఆ చలివేంద్రాన్ని పోలీసులే స్వయంగా కూల్చేయటం పట్ల ప్రజలు, పంచాయతీ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో వేసవి కాలం వస్తున్న తరుణంలో ఈ విధంగా చలివేంద్రాన్ని కూల్చటం ఏందని ప్రజలు మండిపడుతున్నారు. దీనిపై ఎస్సై బీ మహేంద్ర మాట్లాడుతూ చలివేంద్రం పోలీస్‌స్టేషన్‌కు అడ్డంగా ఉందని, బోర్డు కూడా కనబడటం లేదని ఎప్పటి నుంచో దీనిని ఇక్కడి నుంచి తొలగించాలని పంచాయతీ వారికి చెప్పామని వారు పట్టించుకోలేదన్నారు. కొద్ది రోజుల్లో ఎస్పీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్షన్ ఉందని, ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ను అందంగా తీర్చిదిద్దుతున్నామని స్టేషన్ ముందు అంతా బాగు చేశామని ఈ క్రమంలో పంచాయతీ వారికి సమాచారం అందించి వారి సహకారంతో చలివేంద్రాన్ని తొలగించానన్నారు. ఇందులో ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదని చెప్పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ చలివేంద్రం తొలగింపునకు సంబంధించి తనకు ఎటువంటి సమాచారం లేదని, మధ్యాహ్నం సర్పంచ్ భర్త సుధాకర్ ఫోన్ చేసి చలివేంద్రాన్ని తొలగిస్తున్నారని చెప్పటంతో వెంటనే పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లానని అప్పటికే తొలగించి ఆ మెటీరియల్ కుప్పగా వేశారని తెలిపారు. దీనిపై సర్పంచ్ తాటిపర్తి వనజ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్నామని మరో రెండు నెలల్లో వేసవి వస్తున్న సమయంలో ఈ విధంగా పోలీసులు చలివేంద్రం తొలగించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగింపు పై తనకు ఎటువంటి సమాచారం లేదని వివరించారు.

ప్రచారయావకే దావోస్ పర్యటన

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్



కుప్పం ప్రసాద్

ఒంగోలు సిటీ: సీఎం చంద్రబాబు బృందం చేసిన దావోస్ పర్యటన కేవలం ప్రచారయావకే పరిమితమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు విశ్వాసం కల్పించడంలో ఘోర వైఫల్యం చంద్రబాబు బృందం చవిచూసిందని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్ దావోస్ వెళ్లేటప్పుడు తమ ప్రచారం కోసం లోకేష్ ను ప్రమోట్ చేసుకునేందుకు జాతీయ మీడియా కు పెద్ద ఎత్తున డబ్బును ఇచ్చేందుకు జీవోలు జారీ చేశారన్నారు. పవన్ కళ్యాణ్ వల్లే ఈ రోజు చంద్రబాబు సీఎం గా ఉన్నాడనీ, కానీ పవన్‌కళ్యాణ్ ను దావోస్ కు తీసుకువెళ్లలేదన్నారు. నారా లోకేష్ కు రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ అడ్డు వస్తాడనే అనుమానంతో ఆయనను పక్కకు పెట్టారన్నారు. పెట్టుబడులు తీసుకురాలేకపోవడానికి లోకేష్ రెడ్ బుక్ పాలనే కారణమన్నారు. ముంబై నుంచి ఒక జూనియర్ ఆర్టిస్టును తీసుకువచ్చి ఆమెతో తప్పుడు కేసులు పెట్టించి జిందాల్ వంటి పారిశ్రామికవేత్తలను భయపెట్టి, బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. ఈ సంఘటన చూసిన తర్వాత ఏ పారిశ్రామికవేత్త అయినా ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తారా..? అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీతో పాటు, గౌతమ్ ఆదానీ, జిందాల్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరయ్యారన్నారు. జగన్ పాలన పట్ల పారిశ్రామికవేత్తలకు ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శమన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన, శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటేనే ఎవరైనా పెట్టుబడులు పెట్టేందుకు వస్తారన్నారు. రాష్ట్ర ప్రగతి పై చంద్రబాబుకు ఆసక్తి లేదన్నారు. దావోస్ వేదిక పైన సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది, పేద రాష్ట్రంగా మిగిలిపోయామంటూ మాట్లాడిన తరువాత ఏ పారిశ్రామికవేత్తకు ఏపీ పట్ల గౌరవం ఉంటుందని ప్రశ్నించారు. నారా లోకేష్ కు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలి.. సీఎం ఇవ్వాలంటూ సహచర మంత్రులు అంతర్జాతీయ వేదికలపై చేసిన భజన చూసి పారిశ్రామికవేత్తలే అవాక్కయ్యారన్నారు. ఇలాంటి వైఖరిని దావోస్ లో ప్రదర్శిస్తూ పారిశ్రామికవేత్తలతో సీఎం, అధికారులు ఎన్ని చర్చలు జరిపినా ఏ ఒక్కరూ పెట్టుబడులపై నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు సిటీ: 76 వ గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చెప్పారు. జిల్లా స్థాయి వేడుకలు జరిగే పోలీసు పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు కవాతు, శకటాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్దిష్ట సమయం ప్రకారం జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వీక్షించేందుకు వచ్చే వారి హోదాను, సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ జాగిలాలు డెమో విన్యాసాలను తిలకించి, డ్రోన్ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం నిర్వహణలో సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. అతిథులకు సీట్ల కేటాయింపు, వాహనాల పార్కింగ్ , భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే వారికి తాగునీరు, స్నాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను తెలియజేసేలా స్టాల్స్ ఉండాలని, ఆ దిశగా ఏర్పాట్ల విషయంలో శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరు కానున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ (ఎస్పీ అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్ఓ చిన ఓబులేసు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్ల సమాజానికి వెలుగు

- వారి ఎదుగుదలకు సామాజిక రుగ్మతలు అడ్డుకాకూడదు
- బాలికా దినోత్సవంలో మంత్రి స్వామి



బాలికా దినోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఒంగోలు అర్బన్: ఆడపిల్లలు సమాజానికి వెలుగునిస్తారని, వారు లేని సమాజం చీకటితో సమానమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పాల్గొన్నారు. తొలుత బాలికా స్వేచ్ఛ-బాల్య వివాహాల నివారణ కోసం మద్దతుగా ఏర్పాటు చేసిన బ్యానర్‌పై సంతకాలు చేసి అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికలు స్వేచ్ఛగా సమాజంలో ఎదిగేందుకు సామాజిక రుగ్మతలు కారణం కాకూడదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ నిర్ణయ స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. దీనిలో మేయర్ సుజాత, ఐసీడీఎస్ పీడీ హేనసుజన్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్, డీఈఓ కిరణ్‌కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, కార్మిక శాఖ సహాయ కమిషనర్ అనిత, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డీసీపీవో దినేష్‌కుమార్, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, సీడీపీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు. బాల్య వివాహం చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వసంత అనే విద్యార్థినిని అభినందించారు. బాల్య వివాహాల నిషేధం కోసం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ స్థాయిలో
ఒంగోలు వైద్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

ఒంగోలు సిటీ: ప్రతిష్టాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో రెండు ఫెలోషిప్‌లను ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు సాధించి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఏడుకొండలరావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల ఫైనలియర్ ఎంబీబీఎస్ విద్యార్థులు కె.వైష్ణవి, జి.తారాలి శ్రీలు డాక్టరు భాస్కరి కొల్లి, డాక్టరు స్పందన పమిడి గైడెన్స్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ శ్రీదేవి, ఫ్యాకల్టీ సభ్యుల సహకారంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఫెలోషిప్‌లు పొందినందుకు అభినందనలు తెలిపారు. ఈ విజయంతో కమ్యూనిటీ మెడిసిన్ పరిశోధనలో వారి అంకితభావం, గణనీయమైన సహకారాన్ని చాటడమే కాకుండా అకడమిక్ ప్రావీణ్యానికి, సమాజ సేవను ప్రతిబింబిస్తోందన్నారు. దేశం మొత్తంమీద 7 వేల మంది మెడికల్, డెంటల్, నర్సింగ్ విద్యార్థులు ఐసీఎంఆర్ ఎస్టీఎస్ ప్రాజెక్టు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 500 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి మూడో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులలో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు.

ఆలయ భూముల్లో ఆక్రమణల తొలగింపు



బోర్డు ఏర్పాటు చేస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో ఆక్రమణలను శుక్రవారం తొలగించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఆక్రమణదారులకు ముందుగా నోటీసులిచ్చి, గడువు అనంతరం 8.78 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్థలంలోకి ఇతరులు ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లేశ్వరరాజు, జీవీ సత్యనారాయణ, ఈఓ బి.రమేష్, నారాయణరెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అరణ్యంలో గొడ్డళ్ల గర్జన!



నల్లమల అభయారణ్యంలోకి దర్జాగా ప్రవేశించి వెదురు, ఇతర కలప ఉత్పత్తులను తరలించుకు పోవడం అంత సులువా? చెక్‌పోస్టులు దాటి, అటవీ అధికారులు, సిబ్బంది కళ్లుగప్పి కలపను అక్రమంగా రవాణా చేయడం అయ్యే పనేనా? దాదాపు అసాధ్యమనే చెప్పాలి. కానీ ఇంటి దొంగలు సహకరిస్తే అన్నీ సాధ్యమే. గిద్దలూరు నల్లమల అభయారణ్యం పరిధిలో సిబ్బంది కొరత అక్రమార్కులకు కలిసొస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిలో కొందరిని తమ వైపునకు తిప్పుకున్న అక్రమార్కులు కలపను యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- అక్రమంగా తరలిపోతున్న అటవీ సంపద
- అక్రమార్కులకు ఆదాయ వనరుగా వెదురు, కలప రవాణా
- అటవీశాఖలో ఇంటి దొంగల సహకారంపై అనుమానాలు
- వన్యప్రాణులకు పొంచి ఉన్న ప్రమాదం
- సిబ్బంది కొరతతో అరణ్య సంరక్షణపై నీలినీడలు

గిద్దలూరు రూరల్:

అరణ్యంలో గొడ్డలి చప్పుళ్లు వినిపిస్తున్నాయి. వన్యప్రాణులు ప్రాణ భయంతో పరుగులు తీస్తున్నాయి. గిద్దలూరు అటవీశాఖ పరిధిలో 10 వేల హెక్టార్లలో విస్తరించిన నల్లమల అభయారణ్యం ప్రకృతి సంపదకు పెట్టని కోటలా నిలుస్తుంది. అయితే గత కొంత కాలంగా అటవీ సంపద నరికివేత అధికమైంది. అభయారణ్యంలోకి ప్రవేశించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి లేనిదే వీలు పడదు. అలాంటిది కలప దొంగలు అభయారణ్యంలో ఎలా అడుగు పెడుతున్నారో అంతు చిక్కడం లేదు. గిద్దలూరు అటవీశాఖ పరిధిలో గుండ్లకమ్మ రేంజ్, తురిమెళ్ల, బేస్తవారిపేట, గిద్దలూరు, స్క్వాడ్ రేంజ్‌లు ఉన్నాయి. గిద్దలూరు రేంజ్ పరిధిలోని గుండ్లమోటు, గుండ్లకమ్మ రేంజ్ పరిధిలోని కుక్కలగుండం, ఇసుకలగుండం నుంచే కాకుండా నంద్యాల జిల్లా పచ్చర్ల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెదురు, ఇతర కలప తరలిపోతోంది. గడిచిన రెండు వారాల్లో గిద్దలూరు రైల్వే స్టేషన్ గుండా అక్రమంగా తరలిస్తున్న వెదురు బొంగులు, పొగాకు బ్యార్నీ కర్రల కట్టలను పెద్ద ఎత్తున అటవీ శాఖ అధికారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.



అక్రమంగా తరలిస్తున్న వెదురు కట్టలను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు

జంతువులు బలి

కలప, వెదురు నరికే వారి గొడ్డలి చప్పుళ్లకు వన్యప్రాణులు బిక్కుబిక్కుమంటుంటే.. వేటగాళ్లు మాత్రం వాటిని వండుకు తినేస్తున్నారు. అభయారణ్యంలోకి యథేచ్ఛగా ప్రవేశించి వారికి నచ్చిన జంతువులను బలితీసుకుంటున్నారు. గుండ్లకమ్మ రేంజ్ పరిధిలో దుప్పి, జింక, ఉడుము, కణితి, నెమలి, అడవి పందులు లాంటి వన్యప్రాణులను వేటాడిన కేసులు గత మూడేళ్లలో 40 వరకు నమోదయ్యాయి. గిద్దలూరు, తురిమెళ్ల, బేస్తవారిపేట రేంజ్ పరిధిలో 25 కేసులు నమోదైనట్లు సమాచారం.



అడవిలో కణితిని చంపిన వేటగాళ్లు(ఫైల్)

సిబ్బంది భర్తీ ఎప్పుడు?

సెప్టెంబర్ 2022లో గిద్దలూరు అటవీశాఖ కార్యాలయం పరిధిని అభయారణ్యంగా మార్చారు. అధికారులు అడవికి దూరంగా ఉండటం, తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో వేల హెక్టార్లలో విస్తరించిన అభయారణ్యం సంరక్షణపై నీలినీడలు అలుముకున్నాయి. గిద్దలూరు అటవీ శాఖ పరిధిలో 5 రేంజ్‌ల్లో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల(ఏబీఓ) పోస్టులు 31, ఎఫ్‌బీఓలు 10, ఎఫ్ఎస్ఓ పోస్టులు 6 ఖాళీగా ఉన్నాయి. గుండ్లకమ్మ రేంజ్ పరిధిలో ఇసుకలగుండం నార్త్, ఈస్ట్, మాలకొండ పెంట ఈస్ట్, వెస్ట్, ఓబులేసు పెంట, దిగువ మెట్ట ఈస్ట్, వెస్ట్, టన్నెల్ బీటు, దిగువమెట్ట ఠాణాలో 2 వెరసి మొత్తం 10 ఏబీఓ పోస్టులకుగాను అన్నీ ఖాళీగా ఉన్నాయి. గిద్దలూరు రేంజ్ పరిధిలో కొత్తకోట, సంద్రపాడు, బోది, ఎస్ఆర్ పేట, గడికోట, గడికోట ఠాణాధికారి మొత్తం 6 ఏబీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తురిమెళ్ల రేంజ్‌లో రాచర్ల, ఆకవీడు, పుల్లలచెరువు, జేబీకే పురం, పాపినేనిపల్లె, బొల్లుపల్లె, వెలగలపాయ, పాపినేనిపల్లె-2, పాపినేనిపల్లె ఠాణాలో 2 వెరసి మొత్తం 10 ఏబీఓ పోస్టులకుగాను అన్నీ ఖాళీగా ఉన్నాయి. బేస్తవారిపేట రేంజ్ పరిధిలో కొమరోలు, చింతలపల్లె, తాటిచెర్ల, కోనపల్లె, శింగరపల్లెలో 5 ఏబీఓ పోస్టులుండగా అన్నీ భర్తీ చేయాల్సి ఉంది.



గిద్దలూరు అటవీశాఖ కార్యాలయం

వెదురు కలప లారీ స్వాధీనం



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వెదురు కలప లారీ

గిద్దలూరు రూరల్: అక్రమంగా వెదురు కలప తరలిస్తున్న లారీని గిద్దలూరు రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు-పోరుమామిళ్ల మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సరైన పత్రాలు లేకుండా వెదురు కలప తరలిస్తున్న లారీని సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. గిద్దలూరుకు చెందిన రంగస్వామి అనే వెదురు దుకాణం యజమాని అసోంలో కొనుగోలు చేసినట్లు చెప్పగా అందుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



సాగర్(ఫైల్)

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. చల్లగల్ల సాగర్(58) స్వగ్రామం అక్కల్‌రెడ్డిపల్లె కాగా గత 20 ఏళ్లుగా అర్బన్ కాలనీలో ఉంటూ కూలీ పనులకు వెళ్లేవాడు. భార్య మరణించడం, ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లో స్థిరపడటంతో సాగర్ ఒంటరిగా ఉంటున్నాడు. సాగర్ మృతి చెంది మూడు రోజులై ఉంటుందని తెలుస్తోంది. అనారోగ్యంతో కన్నుమూశాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి సోదరి ఎలిజబెత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

అమానుషంపై ఆగ్రహం



పొదిలి పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు



పోలీసులను నిలదీస్తున్న గ్రామస్తులు

- అంత్యక్రియలు అడ్డుకున్న వారికి కొమ్ముకాయడమేంటి?
- దారుణంగా ప్రవర్తించిన అధికారులను సస్పెండ్ చేయాలి
- న్యాయం కోరుతూ పొదిలి పోలీసుస్టేషన్ ముందు మృతుడి బంధువుల ధర్నా

పొదిలి రూరల్: శ్మశానం విషయంలో రెండు వర్గాల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించక పోవడమే కాక, అధికార పార్టీకి కొమ్ము కాసిన అధికారులను సస్పెండ్ చేయాలని ప్రకాశం జిల్లా పొదిలి మండలం టీ సల్లూరు గ్రామస్తులు ఒంగోలు-కర్నూలు రహదారిపై పొదిలి పోలీస్‌స్టేషన్ ముందు శుక్రవారం ధర్నా చేశారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన టీ సల్లూరు గ్రామానికి చెందిన వెలగాల వెంకటేశ్వర్లు మృతదేహాన్ని శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేయనీయకుండా గ్రామంలోని మరో సామాజికవర్గం వారు అడ్డుకున్నారు. దీంతో మృతదేహాన్ని రోడ్డు మీదే ఉంచి భీష్మించి కూర్చున్న మృతుని బంధువులు చేసేదేమీ లేక గురువారం అర్ధరాత్రి వారు కోరుకున్న చోట కాల్చివేశారు. అనంతరం శుక్రవారం ఒంగోలు-కర్నూలు రహదారిపై పొదిలి పోలీసు స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించి గంటసేపు ధర్నా చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే అంత్యక్రియలను కులాలను ఆపాదించడం, ఒక వర్గం వారే శ్మశాన వాటికను ఉపయోగించుకోవాలని, మిగిలిన వారికి కుదరదు అని చెప్పడం నీచమైన చర్య అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు బాధితులపై దాడి చేయడం, మహిళలను, చిన్నపిల్లలను కొట్టడం, యువతను రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని బెదిరించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనకు పాల్పడిన పొదిలి తహశీల్దార్, సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంత్యక్రియలను అడ్డుకున్న వారిపై కేసులు పెట్టి కఠినమైన శిక్షలు వేయాలని కోరారు. దీంతో పోలీసులు, బాధితుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దాదాపు గంటసేపు రోడ్డుపై ధర్నా చేయడంతో ఇరువైపులా ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌లో 108 సర్వీస్ మధ్యలో ఇరుక్కు పోయింది. దీంతో పోలీసులు బాధితులకు సర్దిచెప్పి 108ను అక్కడ నుంచి పంపించి వేశారు. మృతుడి కుటుంబాన్ని బీసీవై పార్టీకి చెందిన బోడె రామచంద్ర యాదవ్ పరామర్శించారు.

ప్రైవేట్ కళాశాలలో లోకేష్ జన్మదిన వేడుకలు

- బాలికతో డ్యాన్స్ వేయించిన యాజమాన్యం



టీడీపీ నాయకుల సమక్షంలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

యర్రగొండపాలెం: రాష్ట్ర మంత్రి లోకేష్ జన్మదినం సందర్భంగా పెద్దదోర్నాలలోని ఒక ప్రైవేట్ కళాశాలలో వేడుకలు జరుపుకున్నారు. గురువారం జరిగిన ఈ వేడుకల వీడియో వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. ఈ వేడుక నిర్వహించడం ఆ కళాశాల యాజమాన్యం ఇష్టఅయిష్టాలపై ఆధారపడి ఉండవచ్చు. కానీ విద్యా బుద్ధులు నేర్చుకోవటానికి వెళ్లిన బాలికతో ఆమె తోటి విద్యార్థుల ముందు డ్యాన్స్ వేయించడం ఎంతవరకు సబబు అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. జన్మదిన వేడుకల్లో పాల్గొనటానికి వచ్చిన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతోపాటు పలువురు టీడీపీ నాయకులు బాలిక డ్యాన్స్‌కు అభ్యంతరం తెలపకుండా మిన్నకుండిపోయారు.

మధ్యవర్తిత్వంతో కక్షిదారుల సమస్యలకు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం అనేది భవిష్యత్ రోజుల్లో కక్షిదారుల మధ్య సమస్యల పరిష్కారానికి మరింత మెరుగ్గా పనిచేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా న్యాయస్థానం సమావేశ మందిరంలో నిర్వహించిన 40 గంటల మీడియేషన్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మధ్యవర్తిత్వం అనేది సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదిక అని అన్నారు. శిక్షణ ముగించిన న్యాయవాదులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వారికి అప్పగించిన మీడియేషన్ వ్యాజ్యాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన సుప్రీంకోర్టు న్యాయవాదులు నగీన జైన్, జయ గోయలను అభినందించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు డి.అమ్మన్నరాజా, పి.లలిత, సీనియర్ న్యాయమూర్తులు జి.దీన, ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

బిడ్డల బాల్యం బంగారుమయం కావాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



బంగారుబాల్యంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బిడ్డల బాల్యం బంగారుమయంగా ఉండాలని, అందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లాస్థాయి బంగారుబాల్యం కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. జిల్లాలో బాల్య వివాహాలను నివారించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని, అందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అర్హులైన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. డ్రాపవుట్ అయిన 15 నుంచి 18 ఏళ్ల విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలకు పంపాలన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి చిన్నారుల ఉత్తమ భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ ద్వారా విడిపించిన పిల్లలకు తదుపరి మెరుగైన భవిష్యత్తు కోసం అందుబాటులో ఉన్న మార్గాలను వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనసుజన్, డీసీపీఓ దినేష్‌కుమార్, బంగారుబాల్యం నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ కనకదుర్గ, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, బీసీ సంక్షేమ అధికారి అంజల, డీఈఓ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెత్తందారులను అరెస్టు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు



రుద్రసముద్రంలో బాధిత కుటుంబంతో కలిసి నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో గిరిజన కుటుంబంపై దాడి చేసి గృహాలు, వాహనాలను తగలబెట్టిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రసముద్రం గ్రామాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ రుద్రసముద్రం గ్రామంలోని ఎరుకల కుటుంబంపై అక్రమ నేరం మోపి మాట వెంకటేశ్వర్లు, ఆయన భార్య శివమ్మను అదే గ్రామానికి చెందిన దుగ్గెంపూడి చంద్రిక, ఆమె భర్త మల్లికార్జున, బంధువులు అడ్డగించి కులం పేరుతో దూషించారని తెలిపారు. గృహాలను ధ్వంసం చేసి ఆటో, మోటార్ సైకిళ్లను తగలబెట్టారని చెప్పారు. నిందితులను అరెస్టు చేయాలని, బాధితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీ రుద్రసముద్రం గ్రామాన్ని సందర్శించాలని కోరారు. దర్శి డీఎస్పీ పి.లక్ష్మీనారాయణ రాజకీయ ఒత్తిళ్లకు లొంగి కేసును నిర్వీర్యం చేసే చర్యలు ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గిరిజన సంఘ అధ్యక్షుడు పేరం సత్యం, ఎరుకల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ ధర్మ, బీసీ సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొట్ల సుబ్బారావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకరరావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపత్రి వెంకటస్వామి, ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, సీపీఎంఎల్ రెడ్‌స్టార్, జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు ధనరాజ్, పిల్లి ఆంజనేయులు, కులాల దండోరా నాయకుడు ఆకుర్తి ప్రసాద్, యాదవ సంఘ జిల్లా నాయకులు అప్పారావు, కోటి యాదవ్, బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు గుంటూరు మస్తాన్‌రావు, గిరిజన సంఘ నాయకుడు సైదా నాయక్, యానం సంఘ నాయకుడు దొడ్ల శ్రీను, ఇతర ప్రజా సంఘాల నాయకులు మరో 50 మంది గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ముందుగా దొనకొండ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామాన్ని సందర్శించిన అనంతరం దర్శి డీఎస్పీ పి.లక్ష్మీనారాయణను కలిసి మాట్లాడారు.